# పనితనం

బెంగుళూరు!... అరెరె! అంత పట్నాన్ని పట్టుకోని ఊరనే దానికి నోరెట్టా ఆడిందో కానీ ఊరా అది? ఎక్కణ్ణో ఉండే సొర్గలోకాన్నే తెచ్చి ఆడ పెట్టేసినట్టుండాది. ఎవురీ మాటనింది? ఒకరనే దానికేముండాదిలే? కండ్లారా చూస్తా ఉంటే మల్లా దానికొక మద్దిస్తం పెట్టాల్నా? ఇంత బాగుండాదని చెప్పేదానికి! రైలు దిగింది మొదులుకోని చూస్తానే ఉండ్లా? ఎప్పుడబ్బా రైలు దిగింది? నిన్న... తూరుపు రేకలు మైలిరేసే యాళ కాడ. అప్పిట్నించీ యింకేం పనుండాదని? నిల్సిన చోట నిలబడేది లేదు. చూసిన చోట చూసేది లేదు. ఒక్క మోపన అదే పనిగా తిరగతా ఉండ్లా?

నిన్న పొద్దనంగా రైలు దిగినామా? దిగీ దిగంగానే ఆ ప్లాట్‌పారం మిందనే ఒక కొళాయి ఉంటే ఆడికి పొయ్‌నామా? రొండు శారల్ల నీళ్లట్టా నోట్లో పోసుకోని పుక్కలించి ఊసేసినామా? ఆదరా బాదరా మొకం కడిగినట్టు కడుక్కున్నామా? అప్పిటికే పొద్దు కర కర మొలస్తా ఉండాది. పొద్దు మొలస్తా ఉంటే గూడా సలి సలిగా ఉండాది. ఆ సలి చక్కలిగిల్లి పెట్టినట్టుంటే ఎగిరెగిరి పళ్లేదు గానీ ఉణ్ణెట్టుండి వొళ్లు జిలపరిస్తా ఉండాది. అట్టా జిలపరించినపుడు యాడికన్నా పొయ్ యెచ్చంగా ముడుక్కుంటే బాగుణ్ణనిపిస్తా ఉండాది. అయితే వచ్చిన పని? అందుకే తుండు గుడ్డతో మొకం తుడ్సుకుంటానే పొయ్ ఊళ్లో రోడ్ల మింద పణ్ణామ్. అది మొదులుకోని వొగిటే తిరుగుడు కదా?

రోడ్డు మింద పణ్ణామంటే రోడ్లా అవ్వి. పాలట్టా పోసి యిట్టెత్తుకోవచ్చునే. ఒక్కొక్క రోడ్డు ఎంత యడం ఉండాదని? తిరపతిలో నాలుగు రోడ్లు కలిస్తే ఆడొక రోడ్డంత. చూపు ఆన్నెంత దూరం రూళ్ల కర్ర బెట్టి గీత గీసినట్టు సక్కంగా ఉండాయి. ఆరోడ్ల పక్కన చెట్లు?

గవునూరు కార్లో పోతావుంటే రోడ్డు కీవార ఆవార సోలుపుగా నిలబడు కున్న పోలీసోళ్ల మాదిర్నే గదా ఉండాయి. ఇంక యిండ్లంటావా? అవ్వి ఏకంగా చుక్కల్నే చూస్తా ఉండాయి. తలకాయి పైకెత్తి చూస్తే తలగుడ్డ కింద పడిపోతిందేమో అనిపిస్తా ఉండాది. ఆ యిండ్ల చుట్టూ... ఆ యిండ్ల ముందర పూలచెట్లు? పూల చెట్లా అవ్వి? ఇంద్ర దనుస్సును తెచ్చి యింటి ముందరపెట్టుకున్నట్టే ఉండాది. ఆ యిండ్లు ఏడు రంగుల్లో నుంచి ఎగబన్న గోపరాల మాదిరుండాయ్. ఏ ఊళ్లో జూడు అడవుల్ను బోడిగా నరికి పారేస్తా ఉంటే ఆ ఊళ్లో వాళ్లు మాత్రం అడువుల్ను తెచ్చి ఊళ్లోనే పెట్టుకున్నెట్టుండాది.

మా తల్లి సాచ్చిగా చెప్తా ఉండా. ఎన్ని పుంగనూర్లయితే ఒక బెంగుళూరయ్యేదని వాళ్లా యీళ్లా అంటా వుంటే అన్నీ పడాసకం మాటల్లే అనుకుంటా ఉంటి. చూడబోతే అది పదారణాల సత్తింగా ఉండాది. ఆ బెంగుళూర్లో సాయినాద్... వాడితోక మాదిర్తో నేను! – ఆరోడ్ల మింద బడి తిరగతా వుంటే ఎందుకులే మా కత? పుంగనూరు జవానుకంటే అద్దోనం అయిపాయ!

దోవన పోతావుండే వాళ్లం. మా దోవన మేము సగిలిగా పోతావుంటే పరవాలే. ఈవార నువ్వు చూస్తా రా. ఆవార నేను చూస్తా వస్తా! అని నోరు తెర్సుకోని ఎతుకులాడ్తా పోతావుంటే ఎదురుంగా వొస్తావుండే బస్సులు... కార్లు... ఆటోలు... స్కూటర్లు ఏమైపోవాల? అవ్వి ఏమైపోతాయి? వాటి కింద పడ్తే మేమే వొక దోవై పోతాం!

అట్టా మాదిరి ఆ రోడ్లు పట్టుకోని పోతావుంటే ఎండ ఎట్టుండాదని? ఎన్నిల మాదిర ఉండాది. ఆ ఎండ చలికి సగించినట్టుగా ఉండాది. మేము ఆరోడ్డంతా మా అబ్బ సొత్తయి నట్టుగా మమ్మల్నడిగే నాదుడే లేనట్టుగా నడ్సిపోతా ఉండాం. ఎనక పక్కనించి ఒక కారు. ఎంత సేపిట్నించి కొడతా ఉండాదో హారన్ ఒక్క మోపన కొడ్తా వుండాది. కాయం ఒక చోట. కన్ను యింకొకచోట. మా చెవల్లో దూర్తే గదా? ఒక్క మోపన అర్సుకుంటా ఒగుర్సు కుంటా వొచ్చి మమ్మల వొర్సుకుంటా పక్కన నిలబడె!

కారా అది? దేవతలు యిహరించే యిమానమే గదా? ఎంత బాగుండాదని? అంత బాగుండే ఆ కారును తోల్తా ఉండేది ఎవురంటే ఒక ఆడ పిల్ల! ఆ పిల్లది ఎట్టుండాదని? ఆకాశింలో యిహరిస్తా ఉండే దేవకన్నెవురో జారి ఆ కార్లో ఏమన్నా పడిందా అనిపిస్తా ఉండాది. సాయినాద్ కంటి మింద రెప్ప పడకుండా ఆ కార్ను ఆ పిల్ల దాన్ని మార్సి మార్సి చూస్తా ఉండాడు.

''ఏనప్పా? మణిగల్లె హేళిబందిదియా?'' అంటా యాసణ్ణం పడె ఆ పిల్లది!

నేను అదేమీ యినిపించుకోకుండా కారు అందమా? కారు కంటే పిల్లదాని బుగ్గ అందమా? అని గెమనిస్తా ఉండా? ఆ పిల్ల కూడా శానా ఫలాతన్‌గా ఉండాది. నన్ను నా దొంగ చూపుల్ను చూడనట్టే చూసేసింది. ఈడొక పుంగనూర్‌గా ఉండాడను కునిందేమో? నాకల్లా అదొక మాదిరిగా చూస్తా ఇంకొక మాదిరిగా నవ్వతా తుర్రుమనె.

ఆ బెంగుళూర్లో ఆ రోడ్ల మింద అనుబోగాలు వొగిటా? రొండా?... అలివి

మాలినన్ని. అవన్నీ చెప్పుకుంటా కూసుండేదానికి ఏడవితింది గానీ- మరీ ఆ విదాన సొదం ఉండాది చూడండీ? చూసే దానికి రొండు కండ్లూ చాలవే? ఆడ కూసోని గదా మన నాయికులు పేదోళ్లను గురించి మాట్లాడేది. అనుకుండే కుందికి నిజింగా నాకు నవ్వొచ్చె. నవ్వితే వాడికి రగిల్తింది. మొగుడు చచ్చి మొత్తుకుంటా ఉంటే వాడెవుడో రాళ్లేసిన యాపాడం కిందికొస్తింది కత? అందుకే బిగపట్టుకున్నా. ఇట్టా మాదిరి చెప్పాలను కుంటే శానా ఉండాది. దాంతో ఏం పనుండాది గానీ నా సావాసకాపు సాయినాద్‌తో గూడా నేనెందుకు బెంగుళూరికి పొయ్‌నానంటే? ఓయబ్బా! అదొక పెద్ద కతలే!

అప్పటికీ తిరపతిలో ఎలబారక ముందే నేనేమో చెప్పాల్సింది చెప్పనే చెప్పినా.

''ఒరే సాయీ! నిజిం. బెంగుళూరంటే మన చిత్తానూరో చిగురువాడో కాదంటే కరకంబాడో కాళాస్తో! కాదురా. అదెంత పెద్ద పట్నమో ఏం కతో? ఆ పట్నాన ఎన్ని అచ్చాపీసులుండాయో? ఏం పాడో? ఆడికి పోతామే అనుకో. ఆడ ఎతికే దానికి మన వల్ల అవితిందా? ఎతికినా ఆ బుడంకాయంత బుల్లోణ్ణి యాడని పట్టుకో గలతాం రా? ఇది అయ్యే పనా? పొయ్యే పనా?'' అంటే-

''నీతో వచ్చిన తకరారే యిది కదరా? ఎత్తుకుంటానే మొత్తుకోళ్లంటే ఎట్రా? ఇంక ఆడికి పోనే పోతే అయ్యే పని కూడా ఆడికాడికే!'' అంటా యాష్టపడె.

వాడి మునాస ఎందుకు కాదనాలని నేనూ ఎలబార్నా. చీమకు రాసిన రాత శివుడికి రాసిందంటారే? అది యిట్టామాదిరి కతేనేమో! లేకుండాబోతే నిన్న పొద్దుటేళనించి బతుకా బెంగుళూరు రోడ్లకే దత్తమై పాయగదా! ఒక రోడ్డు పట్టుకుండేది. ఈవార నువ్వు చూడు ఆవార నేను చూస్తా అనుకుండేది. ఎతుక్కుంటా ఎలబారేది. యాడన్నా ఒక అచ్చాపీసు కంట్లో పడితే చాలు. గబగబా లోపలికి దూరేది.

''బాబుండాడా?'' అని అడిగేది.

''ఎవుడా బాబు? వాడెవుడికి బాబు?'' -అని వాళ్లు తిప్పించి కొట్టే తలకాయి వాల్చేసేది. నోరు చప్పరించుకుంటా రోడ్డు మింద పడేది. మల్లా అదే పని. తిరిగి తిరిగి కాళ్లు తీపులు తీస్తావుంటే కంటబణ్ణె కాపీహోటల్లో దూరేది. కప్పు కాపీ చెరి సగం పంచు కుండేది. సప్పరించు కుంటా కాళ్లనొప్పులు తీరే దాకా ఆడ కూలబడేది!

నిన్న పొద్దుట్నించి ఈపొద్దు మద్దేణ్ణందాకా ఎన్ని రోడ్లని తిరిగినామో? ఎన్నెన్ని అచ్చాపీసుల్లోకి ఎక్కెక్కి దిగినామో! ఆ మండే వాడికే ఎరిక. ఒక పక్క యిది అయ్యే పని కాదనిపిస్తా ఉండాది. ఇంకొక పక్క యింత దూరం వొచ్చి యింత దూరం తిరిగి తిరిగి యిప్పుడు సాలించుకుంటే స్రెమ ఉర్దాగా పోతిందే అనిపిస్తా ఉండాది. ఇట్టా మల్లగుల్లాలు పడ్తానే కాళ్లు పీకతావుంటే ఒక కాపీహోటల్లోకి దూర్తిమి. కుర్చీ దొరికిందే సాలని కూల బడ్తిమి. సాయి కాపీ తెమ్మంటా ఉండాడు. నా మణుసు అట్టబడి యిట్టబడి కడాన తిరపతిలో పొయ్ పడె!

సాయినాద్‌కి తిరపతిలో ఒక అచ్చాపీసు ఉండాది. రొండు ఆవుగొడ్లో బర్రెగొడ్లో ఉండేటోడు పాలయాపారం పెట్టుకున్నెట్టు అచ్చాపీసు ఉండేటోడు ఒక పత్రిక కూడా పెట్టుకుంటే పేరుకు పేరు. దుడ్లకు దుడ్లు. ఈకాలంలో పామును చూసినా పత్రికను చూసినా ఎవుడికైనా బయిమేగదా?

సాయినాద్‌కు ఒక చిన్న పత్రిక ఉండాది.

ఆ పత్రిక వల్ల వాడికి తిరపతిలో అంతో యింతో పేరుండాది.

నాకు పదోతరగతి దాకా చదివిన తమ్ముడొక డుండాడు.

సాయి పరపతి. నా తమ్ముడి కొక ఉద్దోగం. అదీ నా ప్లాను!

అందుకే ఏమాత్రం ఎసులుబాటు దొరికినా సక్కాపాయ్ అచ్చాపీసులో కూసుండేది. ఆమాటా ఈమాటా మాట్లాడ్తా వాడితో అరట్లుగొడ్తా ఉండేది. వాడికి పొద్దు పాయ్‌నట్లు. నాకు దినాలు లెక్కయినట్లు.

ఆమద్దె ఒకనాడు నాకు పొద్దే పోనంటా ఉండాది. ఇంక పొద్దు పొయ్యేదానికి దోవ యాడుండాదంటే అచ్చాపీసులోనే ఉండాది. ఆడికేపాయ్ కూసోని ఉండా. అప్పుడొక పిలగాడు నేరుగా అచ్చాపీసులోకొచ్చె!

ఆ పిలగాడు గోగుపుల్ల మాదిర్తో సన్నంగా ఉండాడు. సాది పెట్టుకుందామన్నెంత నల్లంగా ఉండాడు. ఇంకా సరిగ్గా మీసకట్టుగూడా ఏర్పళ్లా? మరకలు మరకలుగా మాసిపాయ్‌న చొక్కాయి. సొరాయి. చొక్కాయి మింద సొరాయి. రొండు చేతులు రొండు సొరాయి జేబీల్లో దోపుకోని జంబంగా నిలబడె. మాకల్లా శానా జబర్దస్తీగా చూస్తా ఉండాడు. మేము రెప్పార్సకుండా వాడికల్లానే చూస్తావుండాం.

''ఏమైనా పనుండాదా సార్?'' వాడు అడిగె.

''ఏం పని చేస్తావ్?'' సాయి అడిగె.

''కంపోజింగ్ యిడ్సి పెట్టండ. ప్రెస్సులో యింకే పనైనా సరే!''

''సిలిండర్ మిషన్ గూడా?''

ఆ మాట వాడి చెవిని పడిందో లేదో వాడి పాసుగూల! సిలిండర్ మిషన్లల్లో ఎన్నెన్ని రకాలుండాయో అన్ని రకాల పేర్లు గుక్కదిప్పుకోకుండా చెప్పేసి-

''ఈటిల్లో ఏ మిషన్ అయినా సరే తోల్తా!'' అనె.

''ఇన్ని మిషన్లు తోల్తా నంటా ఉండావ్ గదా? బాగానే ఉండాది. అయితే నీ దగ్గిర ఏమన్నా సర్టిపికట్లు ఉండాదా?''

ఆ మాటతో గూడా వాడు పకపక నవ్వె!

''ఎందుకట్టా నవ్వతా ఉండావే?''

''అది గాదు సార్! ఆ గోయిందరాజుల తేరుకు ఎదురుంగా ఒక ప్రెస్సు కనపడ్తే తొలీతగా ఆడికి పోతి. వాళ్లు మీ తావుకు పొమ్మంటే వస్తుండా. మీరు రశయితలంటగదా? మీ తావన బుక్‌వర్క్ ఏమన్నా నడస్తా ఉండాదేమో అని...''

''దానికి నవ్వేందుకు?''

''కోపం చేసుకో బాకండ. రశయితని మీ కెవురిచ్చినారు సట్టిపికట్టు?''

చెంప మింద చెళ్లుమని పడె దెబ్బ. సాయి మొకం కందగెడ్డ మాదిరై పాయ.

''ఈ పిల్లెదవ యిట్లా మాదిర్తో అడిగినాడనుకో బాకండ. మీ పక్కన్నే ఉండాదే గోయిందరాజులసామి గోపరం. ఆ గోపరాన్ని కట్నె మహన్నబావుడికి ఎవురిచ్చినారు సట్టిపికట్టు? పోనీ! ఆ గుడి ముందర్నే ఉండాదికదా అంత పెద్ద తేరు. దాన్ని చెక్కినాయప్పకు ఎవురిచ్చినారు సట్టిపికట్టు? చేతిలో పనితనం ఉన్నోడికి సట్టిపికట్టు ఎందుకు సార్? అవ్వే నాదగ్గరుంటేనా యీడిదాకా నేనెందుకొస్తాను సార్? ఏ గెవర్నమెంటు ప్రెస్సులోనో కాళ్లాడించుకుంటా కూసుణ్ణా నాకూడు కుక్కలు తినేటివి!''

నోటి మాట బెమ్మాండంగా ఉండాది. చేతిలో పని? చూస్తే గదా తెల్సేది. అందుకే సాయినాద్ మేనేజర్ మణిని పిల్సె.

''మణీ! ఈ పిలగాడికి మన సిలిండర్ మిషన్ చూపించు!'' అనె.

మణితో గూడా ఆ పిలగాడు లోపలికి పాయ. ఇదేందో చూడాల్సిన కతగా ఉండాదనుకోని నేనుగూడా ఆణ్ణుంచి కదల్లా.

''ఎద్దు కాల్లో ముల్లంత లేడు. ఈ పిలగాడేంది? సిలండర్ మిషన్ నడిపేదేంది?'' అని మాలోమేము మల్లగుల్లాలు పడ్తావుంటే మల్లా ఆ పిలగాడు మా ముందిరి కొచ్చె. ఆడెవుడో ఒకడు 'రానూ వచ్చె పోనూబాయ! రాగులు యిసిరి అమ్మిలి గాసే!' అన్నాడంట వాడి బాశాలితో. ''అట్లా మాదిర యీడు లోపలికి పోనూ పాయ. రానూ వచ్చె!'' అనుకుంటా ఉంటే–

''ఒక లీట్రు కిర్సనాలు. అరకిలో ఏస్ట్. తెప్పించండ. పన్నెండు కంతా పారం రెడీ చెయ్‌పించండ!'' అనె.

సాయి ఒక పిలగాణ్ణి తరిమి వాడికి కావాల్సింది తెప్పించి యిచ్చె. పారం రెడీ చెయ్యించమని మణిని పురమాయించె.

గెంట పన్నిండాయ. ఆ పైన అరగెంట గడ్సె! లోపల యీడేం చేస్తా ఉండాడో ఏమో చూద్దామని లెయ్ బోతావుంటే వాడే వచ్చె.

అచ్చేసిన కాగితాల్ను మా ముందర బెట్టె.

నిజింగా మా కండ్లను మేము నమ్మనే లే. దీనికి దేముడే సాచ్చి!

ఇంక చూస్కో నా సామిరంగా! సాయిని పట్టేదానికి పగ్గాలే లేకుండా పాయ.

వాడడిగినంత జీతం యిస్తాననె. తన యింట్లోనే పొణుకుండే దానికి తావు యిస్తాననె. తిండీ తిప్పలన్నీ తానే చూసుకుంటాననె. అప్పటి కప్పుడే అచ్చేసేదానికి ఒక పుస్తకం గూడా తీసుకుండె!

గొడ్డోడు గొడ్డు కోసరం ఏడిస్తే కొవ్వోడు కొవ్వుకేడ్సి నాడంట! నా ఏడుపు నాది. ఇంకపత్రిక శానా శానా బాగావస్తింది. దాంతో వాడి పరపతి మరింత పెగిరి పోతింది. అప్పుడు నా పని యింకా సులబంగా అయిపోతిందని చంకలు తట్టుకుంటి!

ఒక దినం పని చేస్తా చేస్తా వుండి ఆ పిలగాడు- వాడే బాబు టీ తాగేసి వస్తానని పాయ్‌నోడు ఎట్టొచ్చెనో అట్నేపాయ. ఎత్తుకుణ్ణె పుస్తకం పని ఆడికే నిలబడిపాయ. పుస్తకాన్ని అచ్చు కిచ్చినోళ్ల గొంతల మింద కూసుంటే సాయి చేతులు నెత్తిమింది కొచ్చె. ఆ పొద్దు ఆ ఆ కుశాల్లో పడి వాడి అడ్రస్సేమన్నా తీసుకుణ్ణామా పాడా?

ఏవూర్రా? అంటే బెంగ్లూరు! అనె. సరే అనుకుంటిమి.

ఈ పొద్దు ఈరుళ్ళ సూరుళ్ళగా యిద్దరు మొగోళ్ళు అదే పనిగా వాడి కోసరం యీదల మిందపడి అల్లాడ్తా ఉండాం. ఆర్డిచ్చిన కాపీ ఎప్పుడొచ్చిందో?... ఎప్పుడు తాగేసినామో? గుర్తే లేకుండా నా ఆలోశినల్లో నేనుంటే సాయి లెయ్ రా పోదామనె. ఆ కాపీ హోటల్ బయిటి కొచ్చి యింక నడ్సే దానికి ఓపిగ్గూడా లేకుండా కాళీగా పోతావుండే ఒక ఆటోను నిలబెట్టిమి.

ఆ ఆటోను తోల్తా ఉండే దెవుడు? బాబు!

మల్లా ఒకసారి మా కండ్లను మేమే నమ్మలా! నమ్మలేకుండా వాడికల్లా నోరు తెర్సుకోని చూస్తా ఉంటే వాడు అరీ గురీ మనకుండా-

''ఎక్కండి సార్!'' అనె.

''ఇదేందిరా నీ యమ్మా బడవా?'' అంటే-

''పని శాతుండే వాడికి ఏపనైతే ఏమి సార్?'' అనె.

''పనోడుగా ఉండేటోడే యిట్ట జేస్తే ఎట్రా?'' అంటే-

''పనోడుగా ఉండేటోడే యిట్టా జేస్తాడు సార్!'' అనె.

''పనోణ్ణి నమ్ముకుణ్ణె యజమాని ఏమయి పోవాల్రా?'' అంటే-

''మిమ్మల నేనేం మోసం చేసినానా? చేసినన్ని దినాలకు చేసినంత కూలే గద సార్ మీ తావన తీసుకుణ్ణింది. ఎవుడి కడుపాత్రం వాడిది సార్.'' అనె.

''పనోడికి యజమానికి మద్దె నమ్మకాలే లేకుండా బోతే పరిశ్రమలు దెబ్బ తింటాయ్ గదరా?'' అంటే-

''నన్ను నమ్ముకొనే ప్రెస్సు పెట్టుకుణ్ణారా?'' అనె.

ఇంక వాడితో వాదులాడి లాబం లేదనుకోని ఎట్నో వొకట్లా వాణ్ణి లాలించి బేలించి ఎంట పెట్టుకోని తిరపతి చేర్తిమి. ఆ పిలగాడితో కూడా సాయిని రిక్సా ఎక్కిస్తి. నేను పెట్టె శాత పట్టుకోని నడ్సి వస్తా ఉండా. ఆ నాలుగ్గాళ్లమండపం కాడ ముత్తారెడ్డన్న ఎదురుపడె. నా చేతిలో పెట్టె కల్లా చూసి-

''యాణ్ణుంచిరా అబ్బోడా!'' అని అడిగె.

ఆయన్నతో బెంగుళూర్లో పణ్ణె పాట్లన్నీ యిడమర్సి చెప్పి-

''అన్నా! ఆ పిలగాడి చేతిలో పనుండాది. వాడు నా తమ్ముడుండ్లా వాడి చేతిలో పదో తరగతి దాకా చదివిన సర్టిఫికట్టు వొగటుండాది. సర్టిఫికట్టుండే వాడు పని కోసరం ఎతుకులాడ్తా వుంటే పని చేతిలో వుండే వాడి కోసరం మేము ఎతుకులాడు కుంటా పోతిమి. బాగుండ్లా?'' అంటే-

ముత్తారెడ్డన్న ముసి ముసి గా నవ్వె!

''ఎందుకన్నా నవ్వతా ఉండావే?'' అంటే-

''అబ్బోడా!'' చదువుకున్నోడి చేతిలో సర్టిఫికట్టు ఉంటింది. దాంతో వాడేం చెయ్‌గల్తాడు. ఆ సర్టిఫికట్టు చదువుతో చెయ్య గలిగిన పనే చెయ్య గలగతాడు. ఒకడి చేతిలో పనితనం ఉంటిందె. వాడేం చెయ్‌గల్తాడు. వాడికి శాతొచ్చిన పనే వాడు చెయ్య గలగతాడు. ఈ రొండూ లేనోళ్లు ఏ పనైనా చెయ్య గలగతారు. వాళ్లెవురో చెప్పరా చూద్దాం! అనె.

''ఇంకెవురన్నా? మన ఓట్లతో మొగోళ్లయిన మొనగాళ్లే గదా?''

''ఈ మాత్రం తెల్సుకున్నావ్. చాల్సాలు. నువ్వు బతికిపోతావ్ పోరా!'' అనె.

నా బతుకు! అద్దెట్టన్నా పోనీ గానీ ఏమీ చేతలేకుండా ఏమీ చేత గాకుండా ఏపనైనా చెయ్య గలిగిన మొనగాళ్ల బతుకులు మాత్రం అట్టాసం రెట్టమదంగా నా కండ్ల ముందర మెదిలె! ●